సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 21 । మే । 2024


బోయింగ్ ఏరోస్పేస్ శిక్షణకు పాలిటెక్నిక్ విద్యార్థులు 8లో


మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు న్యాయం 8లో


స్వచ్ఛమైన పాల వెల్లువ 8లో

కార్గో సేవలకు 'సిద్ధం'

- పాఠ్య పుస్తకాలు, విత్తనాలు సైతం..
- ఆర్టీసీ లాజిస్టిక్స్ బస్సుల ద్వారా రవాణా
- జూన్ తొలి వారానికి ముందే పుస్తకాల పంపిణీ
- జూన్ ఆఖరి వరకు విత్తనాల సరఫరాకు సన్నాహాలు
- రూ.కోటి ఆదాయం సమకూరుతుందని అంచనా


ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనంలోకి పుస్తకాల లోడ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒకపక్క పాఠశాలలు తెరుచుకునే సమయం ఆసన్నమవుతోంది. మరోపక్క ఖరీఫ్ సీజను సమీపిస్తోంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కార్గో సేవలకు సిద్ధమవుతోంది. గతంలో ప్రైవేటు సంస్థలు, వాహనాల ద్వారా వీటి సరఫరా జరిగేది. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో గతేడాది నుంచి ప్రభుత్వం వీటి సరఫరాను కార్గో విభాగానికి అప్పగించింది. ఈ ఏడాది కూడా ఆర్టీసీ ఆ బాధ్యతలో పాలు పంచుకుంటోంది. తాజాగా ఆ ప్రక్రియను చేపట్టింది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల ఆర్టీసీ జోన్–1 పరిధిలో 38 డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ–లాజిస్టిక్స్) వాహనాలు ఉన్నాయి. ఇప్పుడు వీటి ద్వారా బడి పిల్లలకు అవసరమయ్యే పాఠ్య, నోట్ పుస్తకాల సరఫరాకు శ్రీకారం చుట్టింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు లాజిస్టిక్స్ వాహనాల్లో తరలిస్తున్నారు. అక్కడ నుంచి సంబంధిత అధికారులు పాఠశాలలకు చేరవేస్తారు. వాటిని వారు బడి పిల్లలకు పంపిణీ చేస్తారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల్లో నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలోగా లాజిస్టిక్స్ వాహనాల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కుల రవాణా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజను కూడా మరో నెల రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ఈ ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారానే రవాణా చేయనున్నారు. ఏపీ సీడ్స్ సంస్థ ఇప్పటికే అవసరమైన విత్తనాలను సిద్ధం చేసింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి వివిధ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల)కు ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో తర లించనున్నారు. విత్తనాల తరలింపు కార్యక్రమాన్ని జూన్ నెలాఖరు వరకు చేపట్టనున్నారు.

రూ.కోటి ఆదాయం వచ్చే అవకాశం

గత సంవత్సరం కార్గో విభాగం ద్వారా విత్తనాలు, పాఠ్య పుస్తకాల రవాణా ద్వారా ఆర్టీసీ జోన్–1కు రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అది రెట్టింపు అంటే రూ.కోటి వరకు వస్తుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులతో పాటు రైతులకు అవసరమయ్యే వివిధ రకాల విత్తనాల రవాణా ప్రక్రియను ఆదివారం నుంచి చేపట్టామని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఓఅండ్‌సీ) బి.అప్పలనాయుడు 'సాక్షి'కి చెప్పారు.

అప్పన్న దాసుడొచ్చాడు


కొండదిగువ తొలిపావంచా వద్ద స్వామికి పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

- సింహగిరికి వచ్చిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్
- మూడు నెలలపాటు విడిది

సింహాచలం : ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ సోమవారం సింహగిరికి వచ్చారు. మూడు నెలలపాటు సింహగిరిపై ఉండి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించను న్నారు. తన పరివారంతో సింహాచలం చేరుకున్న దాసుడు తొలుత కొండదిగువ తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందజేశారు. తదుపరి సింహగిరిపై ఉన్న దాసుల సత్రానికి తరలి వెళ్లారు.

ఇదీ దాసుడి చరిత్ర..

ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సేవలో తరిస్తోంది. ఏటా వైశాఖ మాసం నుంచి మొదులుకొని సుమారు మూడు నెలలపాటు వీరు సింహగిరిపై ఉండి స్వామిని సేవించడం పరిపాటి. ఈ మూడునెలల్లో వీరి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సింహగిరికి తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ మూడు నెలల్లో దాసుడు స్వామికి ఆర్జిత సేవలను విశేషంగా జరిపిస్తారు. లక్ష కుంకుమ పూజ, లక్ష తులసిపూజ, గరుడ సేవ, కోలాసేవ, నిత్య కల్యాణం, పుష్పాంజలి సేవలను ఘనంగా జరిపిస్తాడు. ఈసేవల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఒడిశా భక్తులు ఆయారోజుల్లో సింహగిరికి తరలివస్తారు. ఈ మూడు నెలలు వీరి రాకతో సింహగిరిపై సందడి నెలకుంటుంది. సింహగిరి నుంచి దాసుడు తిరుగు ప్రయాణమయ్యే రోజు నగదును మూటలుగా కట్టి ఆలయంలోని హుండీల్లో వేయడం పరిపాటి. ఈ నగదంతా పట్టుపురంలోని దాసుడి ఇంట్లో ఏర్పాటు చేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అక్కడ భక్తులు సమర్పించినదే కావడం విశేషం. తన తండ్రి వనమాలికో దాస్ మరణానంతరం 2008 నుంచి లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించే బాధ్యతలు స్వీకరించారు. దాసుడు బస చేసేందుకు సత్రం కూడా సింహగిరిపై ఉంది.

న్యూస్‌రీల్

అష్టోత్తర శతనామావళి పరోక్ష సేవకు విశేష స్పందన


పోస్టల్ ద్వారా భక్తులకు పంపించేందుకు సిద్ధం చేసిన ప్యాకెట్లు

సింహాచలం : ఈనెల 10న సింహగిరిపై జరిగిన చందనోత్సవం సందర్భంగా ఆరోజు పరోక్షంగా స్వామికి నిర్వహించిన అష్టోత్తరసేవకు భక్తుల నుంచి విశేషంగా స్పందన లభించింది. మొత్తం 592 మంది భక్తులు రూ.1116 టికెట్లు తీసుకుని పరోక్షంగా అష్టోత్తరపూజను స్వామికి జరిపించారు. వీరందరికీ పోస్టల్ ద్వారా కుంకుమ, చందనం ప్రసాదం, ఆలయ చరిత్ర కరపత్రం, డ్రైఫ్రూట్స్‌ను పంపించే ఏర్పాట్లను సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ప్యాకెట్ల రూపంలో వాటిని సిద్ధం చేస్తున్నారు.

ఒలింపిక్స్ దిశగా జ్యోతి పరుగు


భారత్ హార్డిలర్ జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : భారత హార్డిలర్ జ్యోతి ఎర్రాజీ అంతర్జాతీయ మీట్‌లో మరో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించే దిశగా సాగుతున్న ఆమే ప్రయాణంలో ఈ స్వర్ణం దోహదపడనుంది. ఒలింపిక్స్‌లో అర్హత సాధించేందుకు వచ్చే 30వ తేదీలోగా మరో ఐదు అంతర్జాతీయ పోటీల్లో రాణించాల్సి ఉంది. విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్స్‌గా భారత్ తరపున నెదర్లాండ్స్‌లోని కుర్ప్‌ఫాల్జ్ గాలాలో జరిగిన వంద మీటర్ల హార్డిల్స్‌ను 13.06 సెకన్లలోనే పూర్తి చేసి విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకుంది. ఈనెల ప్రారంభంలోనే జరిగిన హారీ షుల్టింగ్ గేమ్స్‌లో విజయం సాధించిన తర్వాత మహిళల వంద మీటర్ల హార్డిల్స్‌లో ఈ మార్క్‌కి ఈ సంవత్సరంలో రెండో టైటిల్. ఈ ఈవెంట్‌లో 200 మీటర్ల టైమ్ ట్రయిల్స్ ఫైనల్‌లోనూ పోటీ పడి ఇద్దరు డచ్ అథ్లెట్స్ వెనుక 23.83 సెకన్ల సమయంలో పూర్తి చేసి మూడవ స్థానంలో నిలిచింది.

ఏయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ హోమ్ సైన్స్, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ మెదటి సంవత్సరం, మెదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పరీక్షల ఫలితాలను విడుదల చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు.

- ఆర్ట్స్ కళాశాల పరిధిలోని జర్మన్, ఫ్రెంచ్, ఫోటో గ్రఫీ డిప్లమా కోర్సుల పరీక్షల ఫలితాలు విడుదల చేశారు.
- ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో బీటెక్ ఆరో సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు.

స్ట్రాంగ్ రూం ప్రాంతంలో రెడ్ జోన్

అల్లిపురం: త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచిన విషయం తెలిసిందే. అయితే ఆ చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధి వరకు రెడ్ జోన్ (నో ఫ్లయింగ్ జోన్)గా ప్రకటించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. రెడ్ జోన్ ప్రాంతంలో డ్రోన్స్, బెలూన్స్ ఎగురవేయుట పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

24న ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్

గోపాలపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 24న ఎంఎస్ఎంఈ మేక్ ఇన్ ఇండియా సపోర్టు స్టార్టప్ అండ్ అగ్రిటెక్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్, డీజీఎస్ సంతోష్‌కుమార్ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం టీటీడీసీలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు. సపోర్టింగ్ హ్యాండ్ హోల్డింగ్ గైడెన్స్, రూ.5 కోట్ల వరకూ రుణ సదుపాయం పొందడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీలోగా పెందుర్తి ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 98667 93111, 99630 45222 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవుడికి లక్ష మల్లెలతో అర్చన


వైభవుడికి లక్ష మల్లెలతో అర్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 22వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఉదయం 5గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాల భోగం, మంగళాశాసనం, పుణ్యాహవాచనం, రుత్విక్వ్వరుణ నిర్వహించారు. అనంతరం 9గంటలకు లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్ర 5గంటలకు సదస్యోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 22న ఉదయం తిరువీధి మహోత్సవం, 23న ఉదయం 6గంటలకు వైభవుడికి పౌర్ణమి పంచామృతాభిషేకం అనంతరం సర్వాంగ వజ్రకవచంతో శ్రీవారి దర్శనం, 25న మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహిస్తారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రేపు సింహగిరిపై నృసింహ హోమం



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై బుధవారం శ్రీ నృసింహ హోమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుంచి నృసింహ హోమాన్ని నిర్వహించనున్నారు.నృసింహ హోమంలోపాల్గొనే భక్తులు 2500 టిక్కెట్టుని www.aptemples.ap.gov.inలలో తీసుకుని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనవచ్చని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో కూడా టికెట్లు లభిస్తాయని తెలిపారు. కాగా బుధవారమే నృసింహ జయంతి కూడా కలిసి రావడంతో ఈసారి నృసింహ హోమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సంకల్పించారు.

కొనసాగుతున్న చందనం అరగదీత


చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత మూడో రోజు సోమవారం కొనసాగింది. ఈనెల 23న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల (120 కిలోలు) పచ్చి చందానాన్ని సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండోరోజు ఆదివారం 37 కిలోల చందనం అరగదీయగా, మూడో రోజు సోమవారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు.

పద్మనాభంలో ఎరువుల స్టోరేజీ గోదాము

మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు


మద్ది రైతు భరోసా కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎం.డి. శేఖర్‌బాబు

పద్మనాభం: జిల్లాలో ఎరువులను నిల్వచేసేందుకు పద్మనాభంలో గోదాము ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు తెలిపారు. భీమునిపట్నం డివిజన్ పరిధిలోని ఆనందపురం మండలం బోని, పద్మనాభం మండలం మద్ది రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, పెందుర్తి మండలాలకు కలిపి పద్మనాభంలో ఎరువుల స్టోరేజ్ గొడౌన్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే రబీ సీజన్‌లో పండించే మొక్క జొన్న, రాగుల పంటలను కొనుగోలు చేసేందుకు 15 రోజులు ముందుగానే మార్క్‌ఫెడ్ తరుపున కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఎరువుల స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గొడౌన్ ఉంటే చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను అదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్, మార్క్‌ఫెడ్ డీఎం కె.రమేష్, ఏఈవో శ్రీనివాస్, వీఏవో రమ్య పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ఉంచాలి

తగరపువలస: ప్రతి రైతు భరోసా కేంద్రంలో కనీసం 20 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు అన్నారు. సోమవారం ఆయన ఆనందపురం మండలం బోని రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ అవుతున్న ఎరువులను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయధికారులతో మాట్లాడారు. గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వ్యవసాయ గోదాములు అలాగే ఇతర అందుబాటులో ఉన్న గోదాములలో ఎరువులు నిల్వ చేసుకోవాలన్నారు. ఎరువుల పంపిణీలో జాప్యాన్ని నివారించాలన్నారు. స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు మొక్కజొన్న, చోడి తదితర పంటలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్, వ్యవసాయాధికారులు కొనుగోలు కాలెండర్‌ను తయారు చేసుకుని కనీసం 15 రోజులు ముందుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, భీమిలి ఏడీ విజయప్రసాద్, మార్క్‌ఫెడ్ డీఎం కె.రమేష్, ఆనందపురం వ్యవసాయాధికారి చావా సంధ్యా రత్నప్రభ, వీవీఏలు, రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ లేటరల్ ఎంట్రీకి దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ఇంటర్‌లో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసినవ విద్యార్థులు పాలిటెక్నిక్‌లో నేరుగా చేరడానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా సమన్వయాధికారి కచరపాలెం పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు తెలిపారు. వీరు ప్రభుత్వ/ప్రయివేటు పాలిటెక్నిక్‌లలో నిర్వహిస్తున్న టెక్నికల్/నాన్ టెక్నికల్ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాది కోర్సులు చేరడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. దరఖాస్తులను ఈనెల 21నుంచి జూన్ 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పంపించుకోవాలన్నారు. ప్రవేశాలకు సంబంధించి ఆప్షన్ల ఎంపిక జూన్ 10న నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం https://apsbtet.in/ ivc/ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

డిప్లమా ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం : రెండేళ్ల డిప్లమా ఫార్మసీ కోర్సులో చేరడానికి ఈనెల 21 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. ఇంటర్ ఎంపీసీ/బైపీసీ కోర్సులు స్టేట్‌బోర్డు/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ సిలబస్‌లో చదివినవారు అర్హులన్నారు. వీరు జూన్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు https://apsbtet.in/pharmacy/ వెబ్‌సైట్‌లో చూడవచ్చని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.



'ఈత'రం

ప్రస్తుతం ఎండాకాలం సీజన్ కావడంతో బయట ఎండలు నిప్పుల కొలిమిలా మండిపోతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఒక చల్లటి వాతావరణంలో ఆహ్లాదకరంగా సరదాగా గడపాలని ఎవరికి ఉండదు చెప్పండి. అలాంటి వారికోసం చక్కటి స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి వచ్చాయి. స్థానిక హోటల్స్‌లోని సిమ్మింగ్‌పూల్స్‌లో సైతం వయో భేదం లేకుండా స్విమ్మింగ్ చేస్తుంటే ఇటీవలే జీవీఎంసీ ఆధ్వర్యంలోని స్విమ్మింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చారు. స్పోర్ట్స్ ఎరీనాలోని స్విమ్మింగ్ పూల్‌తో పాటు స్థానికంగా ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌లోనూ కోచ్‌ల పర్యవేక్షణలో వేసవి శిక్షణా శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పిల్లలంతా ఉత్సాహంగా ఈత కొడుతున్నారు.

- విశాఖ స్పోర్ట్స్

విష్ణుకుమార్‌రాజు అరెస్ట్.. బెయిల్

సీతమ్మధార : రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయాలకు ముడిపెడుతూ ఆరోపణలు చేసిన బీజేపీ ఉత్తర అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు కంచరపాలెం పోలీసులు నోటీసులు ఇచ్చారు. దీనిపై సోమవారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆయనను పోలీసులు విచారించి, అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

అనకాపల్లి: ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు సోమవారం చెప్పారు. స్థానిక నర్సింగరావుపేటకు చెందిన ఇంజరపు జయ, పక్క ఇంట్లో నివసిస్తున్న జ్యోతికి ఆరేళ్ల క్రితం రూ.2లక్షలు అప్పుగా ఇచ్చింది. ప్రతి నెలా వడ్డీ చెల్లించేది. ఆరు నెలల నుంచి అసలు, వడ్డీ ఇవ్వకపోవడంతో ఈనెల 16న జయ, జ్యోతికి చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఈ నెల 18 జయ, జ్యోతి, జ్యోతి కుమార్తె వీనస్‌లపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేరోజు వీనస్ కులం పేరుతో దూషించినట్టు జ్యోతి కుమార్తె వీనస్ ఇంజరపు జయ, జయ భర్త ప్రసాద్, ఇద్దరు కుమార్తెలు గాయత్రి, పూర్ణశ్రీలపై ఫిర్యాదు ఇవ్వడంతో, అట్రాసిటీ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.75,160
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.68,900
వెండి(కిలో):	రూ.1,01,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.138
బ్రాయిలర్ (లైవ్)	: రూ.158
స్కిన్	: రూ.286
స్కిన్ లెస్	: రూ.296

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

స్వచ్ఛమైన పాల వెల్లువ



గిర్ గోవుతో దుర్గారావు



సేంద్రియ విధానంలో పెంచుతున్న పశుగ్రాసం

ప్రస్తుతం కల్తీ లేని ఉత్పత్తులు దొరకడం గగనంగా మారింది. ముఖ్యంగా పాల విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి. అయినా నగరవాసులకు ప్రైవేట్ డెయిరీల పాల ప్యాకెట్లే దిక్కు. ఇది గ్రహించిన ఓ ముగ్గురు యువకులు కల్తీ లేని స్వచ్ఛమైన పాలు నగర ప్రజలకు అందిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. వెంటనే రంగంలోకి దిగారు. సేంద్రియ విధానంలో సాగు చేయడం, ప్రజలకు దేశీ గోవు పాలు అందించడం లక్ష్యంగా ముందడుగు వేశారు. రోజూ విశాఖ నగరానికి దేశీ ఆవు పాలను తీసుకువచ్చి ఇంటికే సరఫరా చేస్తున్నారు. గత ఏడు నెలలుగా వారి ప్రయాణం నిర్విరామంగా సాగుతోంది.

– ఏయూ క్యాంపస్

- సేంద్రియ సాగు.. దేశీయ క్షీరం
- నగరవాసులకు ఆరోగ్యకరమైన దేశీ పాలు సరఫరా
- డెయిరీ నిర్వహణలో ముగ్గురు యువకులు కొత్త మార్గం
- చోడవరం నుంచి నిత్యం నగరానికి ప్రయాణం

చోడవరం మండలం పాట్టిదొరపాలేనికి చెందిన వియ్యపు దుర్గారావు, పల్ల తాతారావు, దాలిబోయిన దుర్గారావు దేశీ ఆవులను పెంచే దిశగా అడుగులు వేశారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, దేశీ గోవులపై అభిమానం కలిగిన ముగ్గురూ హైదరాబాద్ నుంచి మంచి పాలను అందించే సాహివాల్, గిర్ జాతి ఆవులను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. వీటితో పాటు మన ప్రాంతంలో లభించే ఒంగోలు, పుంగనూరు జాతి ఆవులను సైతం పెంచుతున్నారు. పాలను ప్రైవేట్ డెయిరీలకు కాకుండా నగరవాసులకు నేరుగా సరఫరా చేస్తే ఫలితం ఉంటుందని భావించారు. అలా నిత్యం విశాఖకు తీసుకువచ్చి సరఫరా చేయడం ప్రారంభించారు. తొలుత 10 లీటర్ల పాలు మాత్రమే విశాఖలో తమకు తెలిసిన వారికి అందించడం ప్రారంభించారు. శ్రీరాధాకృష్ణ గోశాల పేరుతో ప్రస్తుతం 60 కుటుంబాలకు 50 నుంచి 60 లీటర్ల వరకు నిత్యం పాలను సరఫరా చేస్తున్నారు. ఆటోలో పాలను తీసుకువచ్చి నగరంలో వినియోగదారుల ఇంటికే నేరుగా అందిస్తున్నారు. ఇద్దరు యువకులు గోవుల సంరక్షణ, గోగ్రాసం పెంచడంలో నిమగ్నమవుతున్నారు. మరొకరు నిత్యం నగరానికి పాలను తీసుకురావడం దినచర్యగా పెట్టుకున్నారు.

రోజూ 90 కి.మీ. ప్రయాణం

చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో ఉన్న పాట్టిదొరపాలెం నుంచి నిత్యం విశాఖకు పాలు సరఫరా చేస్తున్నారు. ఆటోలో నిత్యం 90 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. పాలను అర లీటరు చొప్పున ఇంట్లో ప్యాకింగ్ చేసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. పాల ధరను సైతం అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. లాభాల కోసం ఆలోచించకుండా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. త్వరలో పూర్తి ప్రకృతి వ్యవసాయ విధానంలో ధాన్యం పండించడం, దాని నుంచి వచ్చే ఎండుగడ్డినే గోవులకు అందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో పశుగ్రాసం పెంపకం

దేశీ ఆవు పాలను మరింత ఆరోగ్యవంతంగా చేయాలని సంకల్పించారు. దీనిలో భాగంగా పశువులకు అందించే పచ్చిగడ్డిని సైతం సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. పశువుల గెత్తం ఎరువుగా వినియోగించి సూపర్ నేపియర్ గడ్డిని నాటారు. పొలంలో పూర్తిగా పశువుల గెత్తం వేసి, రెండు పర్యాయాలు నేలను దున్నిన తరువాత హైదరాబాద్ నుంచి నేపియర్ గడ్డి కణుపులు కొనుగోలు చేసి నాటారు. రెండో కోత వచ్చే సమయానికి ఒక్కో కణుపు నుంచి 30 నుంచి 35 వరకు గడ్డి పిలకలు వచ్చాయి. వీటిపై గోకృపామృతం పిచికారీ చేయడం, గడ్డి పెంచుతున్న సాళ్ల మధ్యలో జీవామృతం పారించడం చేస్తున్నారు. ఇలా పశుగ్రాసాన్ని సైతం ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నారు.

ప్రజలకు చేరువ కావాలి..

ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన దేశీ ఆవు పాలను అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాం. కొంత శ్రమ ఉన్నప్పటికీ, నేలతల్లికి మేలు చేస్తూ, దేశీ గోవుల సంరక్షణ జరుగుతోందనే సంతృప్తితో ముందుకెళ్తున్నాం. ప్రజల నుంచి కూడా స్పందన బాగుంది. మరింత ఎక్కువ మందికి దేశీ ఆవు పాలను అందించాలనే ఆలోచనతో ఉన్నాం. త్వరలో చెక్క గానుగ నూనె సరఫరా కూడా ప్రారంభిస్తాం.

– వియ్యపు దుర్గారావు, రైతు
ఫోన్ : 7993542689

స్టార్టప్‌లకు ప్రొపెల్ పోటీలు

బీచ్ రోడ్డు: వినియోగదారుల ఉత్పత్తుల రంగంలో స్టార్టప్‌లకు చేయూతనిచ్చేందుకు గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్ ప్రొపెల్ నాలుగో సీజన్ పోటీలు ప్రారంభించినట్టు అమెజాన్ ఇండియా ప్రతినిధి భూపెన్ వాకంకర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ప్రొపెల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్‌లను ఈ కామర్స్‌ను ఉపయోగించి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు చేరువ చేయడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న 50 స్టార్టప్‌లను ఎంపిక చేస్తామని చెప్పారు. వారికి ఆరు నెలల పాటు ఉచితంగా లాజిస్టిక్స్ ఖాతాను అందజేస్తామన్నారు. టాప్ 3 విజేతలు తమ సంస్థ నుంచి మిలియన్ల రివార్డును గెలుచుకుంటారన్నారు. ఆసక్తి ఉన్న వారు జూన్ 14వ తేదీలోగా http://www.amazon.in/propel వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రిన్స్ విభాగంలో విజేత కార్తికేయరెడ్డి



అక్కిరెడ్డిపాలెం: కేరళలోని కాలికట్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ సీజన్-8లో విశాఖపట్నం షీలానగర్‌కు చెందిన కార్తికేయరెడ్డి విజేతగా నిలిచారు. వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో ఔత్సాహికులు ఆడిషనల్‌లో పాల్గొనగా 80 మంది ఫైనల్స్‌కు అర్హత సాధించారని భెల్ (హెచ్‌పీవీపీ)లో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కార్తికేయరెడ్డి తల్లి పావనీ లత సోమవారం తెలిపారు. ఇండియా ఫైనల్స్‌లో ప్రిన్స్ విభాగంలో 8 సంవత్సరాల కార్తికేయరెడ్డి విజయం సాధించడం విశేషమన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన స్టార్ కిడ్స్ సీజన్-2, ఆంధ్ర ఫ్యాషన్ వీక్‌లో కూడా పాల్గొని విజేతగా నిలిచారన్నారు.

బోయింగ్ ఏరోస్పేస్ శిక్షణకు పాలిటెక్నిక్ విద్యార్థులు



బోయింగ్ ఏరోస్పేస్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

మురళీనగర్: ప్రపంచంలోనే అతి పెద్ద ఏరోస్పేస్ కంపెనీ బోయింగ్ ఏరో స్పేస్‌లో శిక్షణకు పాలిటెక్నిక్ విద్యార్థులను సోమవారం ఎంపిక చేశారు. ఈ సంస్థ తమ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా లెర్నింగ్ లిక్స్ ఫౌండేషన్ కింద పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా విశాఖలోని కంచరపా లెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు పర్యవేక్షణలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. విజయనగరం, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విద్యార్థులు ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఏరోస్పేస్ శిక్షణ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉండే ఉపాధి అవకాశాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు విద్యార్థులకు వివరించారు. బోయింగ్ సంస్థ ఏరోస్పేస్ రంగంలో నిర్వహిస్తున్న వివిధ విభాగాలు, ఉత్పత్తి రంగంలో వారి ప్రాముఖ్యతను సంస్థ ఏజీఎం ప్రదీప్ కుమార్, ట్రైనింగ్ ఇన్‌చార్జి రోషన్ విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జరిగింది. కార్యక్రమంలో పాలిటెక్నిక్ మెకానికల్ హెడ్ మధుకుమార్, అధ్యాపకులు హేమలత, రవికాంత్ పాల్గొన్నారు.

31 మందికి అవకాశం : ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌కు 31 మందిని బోయింగ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు ఎంపిక చేశారు. వీరిలో కంచరపాలెం పాలిటెక్నిక్ నుంచి 22 మందిని ఎంపిక చేయగా వీరిలో 9 మంది బాలికలు ఉన్నారు. విజయనగరం పాలిటెక్నిక్ నుంచి 9 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. ఆరునెలల పాటు విశాఖపట్నం ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సంస్థలో ఏరోస్పేస్ రంగంలో శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు నెలకు రూ.3000 ఉపకార వేతనంతోపాటు ప్రతి విద్యార్థికి 35 వేలు ఫీజు బోయింగ్ సంస్థ భరిస్తుంది.

మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు న్యాయం



హాజరైన న్యాయమూర్తులు, వివిధ శాఖల అధికారులు

విశాఖ లీగల్ : కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు మధ్యవర్తిత్వ విధానాన్ని పాటించాలని విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కె.రాధారత్నం చెప్పారు. సోమవారం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో న్యాయమూర్తులు సమావేశ మందిరంలో భారత సర్వోన్నత న్యాయస్థానం మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ), రాష్ట్ర హైకోర్టు మీడియేషన్ కమిటీ, విశాఖ జిల్లా న్యాయ సేవప్రాధికార సంస్థ సంయుక్తంగా మీడియేషన్ కన్సిలేషన్‌పై 40 గంటల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానం ఎంతో అవసరమన్నారు. సత్వర న్యాయంతో పాటు శాశ్వత ఫలితాలు అందించే దిశగా న్యాయస్థానాలు పాటిస్తే మంచిదని ఆమె సూచించారు. సుప్రీంకోర్ట్ మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ జాతీయ శిక్షకులు వీకే బన్సాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మీడియేషన్ విధానం అవలంబించడం వల్ల కోర్టులో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో న్యాయస్థానాలపై భారం తగ్గే అవకాశం ఉందన్నారు. మరో శిక్షకుడు సునీల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయమూర్తులు మధ్యవర్తిత్వం, సంప్రదింపులు విధానం అలవర్చుకోవడం వల్ల న్యాయ వ్యవస్థకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కోర్టులో కేసులు వేసిన వెంటనే మధ్యవర్తి విధానం అవలంబిస్తే ప్రాథమిక దశలోనే చాలా కేసులు రాజీ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 29 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ శిక్షణ మరో నాలుగు రోజులు పాటు కొనసాగనుంది.

సంతోష్‌నగర్‌లో వివాహిత ఆత్మహత్య



మృతురాలు పైడమ్మ

గోపాలపట్నం: ఆర్థిక వివాదాలు కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్‌లో రైల్వే ఉద్యోగి వంతల మోహనరావు, భార్య పైడమ్మ అలియాజ్ కమల(40), పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. మొదటి భార్య డెలివరీ సమయంలో చనిపోవడంతో పైడమ్మను మోహనరావు రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు, రెండో భార్య పైడమ్మకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంతా కలిసి ఒక చోటే నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉండగా.. రెండు రోజుల కిందట కుమారుడితో కలిసి మోహనరావు తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. పిల్లలతో కలిసి ఇంట్లో పైడమ్మ ఉంటోంది. ఆదివారం రాత్రి పిల్లలు పైఅంతస్తులో నిద్రించగా.. పైడమ్మ కింద అంతస్తులో పడుకుంది. సోమవారం ఉదయం పిల్లలు కిందికి దిగి చూసేసరికి పైడమ్మ వంట గదిలో హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఉంది. చుట్టు పక్కల వారిని పిలిచి ఆమెను కిందికి దించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల బంగారాన్ని అనవసరంగా ఎందుకు తాకట్టు పెట్టావు అంటూ పైడమ్మను భర్త నిలదీయంతో చిన్నచిన్న తగాదాలు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. మోహనరావు పెద్ద కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో బంగారం ఎక్కడ తాకట్టు పెట్టావు చెప్పాలని నిలదీయడంతో ఆమె మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. ఇంకా మోహనరావు తిరుపతి నుంచి రావలసి ఉంది. మృతదేహాన్ని గోపాలపట్నం పోలీసులు కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాల సమస్య

- 20వ తేదీ దాటినా అందని వైనం
- కార్మిక సంఘాల వైఫల్యం
- కార్మికుల్లో తీవ్ర అగ్రహం



స్టీల్‌ప్లాంట్ ముఖ చిత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలపై సందిగ్ధిత నెలకొంది. 20వ తేదీ దాటినా జీతాలు చెల్లించక పోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ దానికి జాయింట్ కన్సల్టెంట్ మిషనరీ (జేసీఎ) అని చెప్పుకునే గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రతిపక్ష ఐఎన్‌టీయూసీ, సీఐటీయూలు జీతాల చెల్లింపుల్లో యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో ఘోర వైఫల్యం చెందాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 1న ప్రతిపక్ష యూనియన్ సీఐటీయూ నాయకులు 1,2 తేదీల్లో జీతాలు చెల్లిస్తారని చెప్పగా ఏఐటీయూసీ నేతలు మూడో తేదీన ఇస్తారని ప్రకటించారు. అప్పటి నుంచి ఇదిగో, అదిగో అంటూ 12వ తేదీ వచ్చింది. 12, 13 తేదీలు బ్యాంకుల సెలవు కనుక 14న గ్యారంటీ అని ఏఐటీయూసీ ప్రకటించగా అప్పుడు కూడా చెల్లింపులు జరగలేదు. ఆ తర్వాత సీఎండీ, డైరెక్టర్లు అందుబాటులో లేరని 16న చెల్లింపులు చేయకపోతే 17న స్టీల్‌ప్లాంట్ ముట్టడిస్తామని గుర్తింపు సంఘం హెచ్చరించింది. ముట్టడి కాదు కదా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం ఏదీ చేయకపోవడం గమనార్హం. యూనియన్ల మధ్య సఖ్యత లేకపోవడంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతోనే జీతాల సమస్య కొలిక్కిరావడం లేదు. కార్మిక చట్టం ప్రకారం 7వ తేదీ నాటికి జీతాలు చెల్లించాలి. జీతాలు గాలికి వదిలి జీఎస్టీ, విద్యుత్ చార్జీల చెల్లింపు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తూ కార్మికులను రోడ్డున పడేస్తున్నా పట్టించుకోక పోవడం కార్మిక సంఘాల నాయకుల బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి జీతాలు వెంటనే చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

దాడి కేసులో చర్యలకు డిమాండ్

మహారాణిపేట: తమపై దాడి చేసిన వారిలో ఒకరిపై మాత్రమే కేసు పెట్టారని, ఇంకా చాలా మంది ఉన్నారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బర్మా క్యాంపునకు చెందిన సుంకర నూకరత్నం కోరారు. సోమవారం నూకరత్నం, మరికొంత మంది కుటుంబ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో జేసీ కె.మయూర్ అశోక్‌ను కలిశారు. మరణాయుధాలతో తమను చంపడానికి ప్రయత్నం చేశారని, ఇందులో ఒక్క లోకేష్‌పై మాత్రమే కేసు పెట్టారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై నగర పోలీసు కమిషనర్‌ను కలవాలని జేసీ సూచించారు.

మావోయిస్టు యాక్షన్ టీం సంచారంపై అప్రమత్తం

ఏవోబీలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు



ముంచంగిపుట్టులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మావోయిస్టుల యాక్షన్ టీంల సంచారంపై సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం మారుమూల గ్రామాల నుంచి వచ్చే వాహనాలతోపాటు ఒడిశా నుంచి ఆంధ్రలోకి ప్రవేశించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ అనుమానితులను ప్రశ్నించి విడిచి పెడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ సోదాలు చేసి ప్రయాణికుల వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా గుర్తింపు కార్డులను చూసి విడిచి పెడుతున్నారు. అటు ఒడిశా పోలీసులు సైతం జోలాపుట్టు, ఒనకఢిల్లీ, మాచ్‌ఖండ్ గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలని, పరిచయం లేని వారికి ఆశ్రయం కల్పించవద్దని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలలో ముంచంగిపుట్టు పోలీసులు పాల్గొన్నారు.

• పంట పొలాలకు పులుల కాపలా!



ఏంటీ.. ఫొటోను చూసి పంటపొలాల్లో పులులు సంచరిస్తున్నాయని అనుకుంటున్నారా? అదేం లేదు. మండలంలోని 31 పంచాయతీల్లో జీడిమామిడి, జామతోపాటు పలు రకాల కాయగూరలు పండిస్తున్నారు. వీటికి కోతుల బెడద పెరిగింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట కోతుల పాలవుతుంటే రైతులు తట్టుకోగలరా? అధికారుల్ని ఆశ్రయిస్తే పట్టించుకోలేదు. ఏం చేసైనా తమ పంటను కాపాడుకోవాలనుకునే రైతులు దృష్టి పెడితే ఉపాయాలకు కొదవా..? తమ ఆలోచనలకు పదును పెట్టిన కొందరు రైతులు ఎలుగుబంటి వేషాల్లో కోతుల్ని భయపెడుతుంటే.. ఏపీ పురంలో ఓ రైతు తమ పంట పొలాలకు ఏకంగా పులుల్నే కాపలాపెట్టాడు. అవి ఉత్త బొమ్మలే అయినా.. కోతులు మాత్రం దరిదాపుల్లోకి రావట్లేదట! - నాతవరం